పింఛన్ల పంపిణీలో జాప్యం

- సర్వర్ మొరాయించడంతో ఇబ్బందులు
- లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు



జీవీఎంసీ 33వ వార్డులో పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం : పింఛన్ల పంపిణీలో తొలి రోజు ఇబ్బందులు ఎదురయ్యాయి. సర్వర్ మొరాయించడంతో సమయానికి లబ్ధిదారులకు అందజేయలేకపోయారు. కొన్ని ప్రాంతాల్లో లబ్దిదారులు పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతూ కనిపించారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎవరిని సంప్రదించాలో తెలియక రోడ్లపైనే నిరీక్షించారు. అనంతరం కొన్ని చోట్ల పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జీవీఎంసీ 32, 33, 34 వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు. 32వ వార్డులో కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

పంపిణీ శతశాతం పూర్తి చేయాలి

డాబాగార్డెన్స్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పింఛన్లు ఒకటో తేదీనే అర్హులందరికీ అందించాలని, పంపిణీ శత శాతం పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సచివాలయ కార్యదర్శుల ద్వారా జోన్ – 4 పరిధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రాంతాలు ఆయన పరిశీలించారు. ముందుగా కమిషనర్ జోన్ – 4 జోనల్ కమిషనర్ ప్రసాదరావుతో కలిసి 36వ వార్డు పరిధి ఏవీఎన్ కాలేజ్ రోడ్డు సమీపంలో పర్యటిస్తూ పింఛన్లు అందుతున్నదీ, లేనిదీ పింఛన్‌దారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్దిదారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ పింఛన్ల నగదు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు రూ.4 వేలకు పెంచి అందిస్తోందని, ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమనించాలన్నారు. పర్యటనలో యూసీడీ ఏపీడీ పుణ్యవతి పాల్గొన్నారు.

వారంలో ఒకరోజు ప్రజారవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

జీవీఎంసీ డఫేదార్లకు సత్కారం



సత్కరించిన డఫేదార్లతో అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: పదవీ విరమణ పొందిన జీవీఎంసీ డఫేదార్లను సోమవారం సత్కరించారు. జీవీఎంసీ డఫేదర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రామనారాయణ, అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ చేతుల మీదుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో గల జెమ్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన సుంకరి రాము, గడదాసు మోగారావు దంపతులను సత్కరించి అభినందించారు. శేష జీవితం సాఫీగా సాగిపోవాలని అభిలషించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న డఫేదార్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, మోటార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత – 2023 పేరు మీద డిసెంబర్ 21న పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించిందని, దానికి రాష్ట్రపతి డిసెంబర్ 25న ఆమోద ముద్ర వేశారన్నారు. ఆ చట్టంలోని సెక్షన్ 106 (1, 2) ప్రకారం యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకి 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం వుందని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. దీనిని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ చట్టం డ్రైవర్లను తీవ్ర అసంతృప్తి, ఆందోళనకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వివిధ ఆటో స్టాండ్ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ–మెయిల్ ఐడీ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రజల సహకారంతోనే దోమల నియంత్రణ



ర్యాలీలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : డెంగ్యూ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందని, దీని నివారణ కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే ప్రజల సహకారం లేకపోతే దోమల నివారణ సాధ్యం కాదన్నారు. డెంగ్యూ మీద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పగటి పూట కుట్టే దోమల ద్వారా మాత్రమే డెంగ్యూ వ్యాధి సోకుతుందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, జిల్లా మలేరియా అధికారి తులసిరాజ్, బి.నాగేశ్వరరావు, శశిభూషణ్, నాగభూషణం, వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలా గురువులుకు జన్మదిన శుభాకాంక్షలు



కోలా గురువులుకు శుభాకాంక్షలు చెబుతున్న శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు, మత్స్యకార నాయకుడు కోలా గురువులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకార నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు సోమవారం కోలా స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యుల సేవలు అమూల్యం

- జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్ చైర్మన్ రామారావు
- ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో కేక్ కట్ చేస్తున్న రామారావు, చిత్రంలో డాక్టర్ కె.వి.రామిరెడ్డి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను అభినందిస్తున్న వైద్యులు, సిబ్బంది



కేక్ కట్ చేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివనాగేంద్రరెడ్డి

మహారాణిపేట: రోగుల ఆరోగ్యం, శ్రేయస్సులో కీలకపాత్ర పోషిస్తున్న వైద్యులు అభినందనీయులని జిల్లా మానసిక ఆరోగ్య సమీక్ష బోర్డ్ చైర్మన్ బి.రామారావు అన్నారు. రోగులకు స్వస్థత చేకూరేందుకు వారు అందిస్తున్న సేవలకు వెల కట్టలేమన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో సేవలు అందిస్తున్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, ప్రొఫెసర్లు ఎస్.హరికృష్ణ, డాక్టర్ పి.లోకేశ్వర రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ ఎం.హైమవతి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వైద్యుల దినోత్సవం

మహారాణిపేట : కేజీహెచ్‌లో వైద్యుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ జవహర్, ఇతర ఉద్యోగులు, మినిస్టీరియల్ స్టాఫ్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో వైద్యులకు సత్కారం

మహారాణిపేట: మహారాణిపేటలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్యుల దినోత్సవం నిర్వహించారు. వైద్య రంగంలో మహనీయుడు బిధాన్ చంద్రరాయ్ చేసిన సేవలను చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి కొనియాడారు. ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి రవికుమార్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.లక్ష్మి,జి.అశ్విని, ఎం.ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్‌లో కేక్ కట్ చేశారు. పలువురు వైద్యులను సన్మానించారు.

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

డాబాగార్డెన్స్ : టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి సేవలో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు అర్జీలను జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఏపీడీలు కమలావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అతిసారతో ఒక్కరూ చనిపోరాదు

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



సభలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

డాబాగార్డెన్స్ : అల్లూరి 127వ జయంతోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల పిల్లలు, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మరిన్ని వివరాలకు 94907 50661లో సంప్రదించాలని సూచించారు.

గొయ్యి పూడ్చారు



బౌడారా రోడ్డులో గొయ్యి పూడ్చుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న గోతి పూడ్చివేత పనులను సిబ్బంది ప్రారంభించారు. బౌడారా రోడ్డు ప్రధాన మార్గంలో విద్యుత్ మరమ్మతుల కోసం అధికారులు భారీ గోతిని తవ్వారు. అయితే, దానిని అలా వదిలేయడంతో వాహనచోదకులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడేవారు. వారి అవస్థలపై సాక్షి దినపత్రికలో సోమవారం 'గొయ్యి తీసి వదిలేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ తీగల పనులు చేసి, గొయ్యి పూడ్చివేత పనులు చేపట్టారు. దీంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. జోన్ పరిధిలోని వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 39వ వార్డులో ఇళ్ల వద్ద నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కాలం కావడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల వద్ద నిల్వ నీటిలో దోమలు గుడ్లు పెట్టడంతో అవి వృద్ధి చెందుతాయన్నారు. ప్రమాదకరమైన మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. అందుకే ఇళ్ల వద్ద నిల్వ నీళ్లతో పాటు పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు వంటివి ఉండకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నీటినిల్వలను పారబోయించారు. ప్రతీ ఇంటికి ఏఎస్ఎంలు తప్పనిసరిగా విజిట్ చేస్తారని తెలిపారు. ఎవరికైనా జ్వరాలు ఉంటే వెంటనే ఏఎస్ఎంకు చెబితే, సమీపంలోని ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయిస్తారని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఏయుటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం: రైల్వే స్టేషన్లో భిక్షాటన చేసుకుంటున్న మహిళకు ఆశ్రయం కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు ఏయూటీడీ సిబ్బంది. వివరాలివి.. లక్ష్మి అనే మహిళ రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేసుకోవడంతో ఆమెను ఆర్పీఎఫ్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది సంరక్షించి, ఇటీవల టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌లో వసతి కల్పించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్న ఏయుటీడీ కార్యదర్శి ప్రగడ వాసు పద్మనాభం మండలంలోని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఇంటి నుంచి ఎక్కడికీ వెళ్లకుండా కట్టడి చేయాలని ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు.

డాక్టర్ రవిచంద్రకు సన్మానం



డాక్టర్ రవిచంద్రను సన్మానిస్తున్న ఎంవీ రాజశేఖర్

మహారాణిపేట : ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ దగ్గర ఉన్న కార్యాలయంలో ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ రవిచంద్రను పలువురు ప్రముఖులు సన్మానించారు. శ్రీహరి సంకీర్తన సేవా సంస్థ, అన్నమయ్య సంస్థ, గీతాంజలి సంస్థ సంయుక్తంగా డాక్టర్ రవిచంద్రను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. గీతాంజలి సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, కె.రామకుమార్ తదితరులు డాక్టర్ రవిచంద్ర సేవలను కొనియాడారు.

3 నుంచి డీఎస్సీ ఉచిత తరగతులు

సీతమ్మధార : ఈ నెల 3 నుంచి ద్వారకానగర్ మూడో లైన్‌లో గల ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్ పరీక్షలపై అవగాహన సదస్సుతోపాటు ఐదు రోజులు ఉచిత తరగతులు నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్లు అప్పలనాయుడు, తిరుపతిరావు, దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్, డీఎస్సీకి సిద్ధమయ్యేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9849486893లో సంప్రదించాలని కోరారు.


వివేకానంద సంస్థలో అన్నదానం



అన్నదానం చేస్తున్న జహీర్ అహ్మద్, మక్బూద్ అహ్మద్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవాసంస్థలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మక్బూద్ అహ్మద్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మక్బూద్ అహ్మద్‌ను వివేకానంద సంస్థ అధ్యక్షుడు అప్పారావు సన్మానించారు. డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ వివేకనంద సంస్థ ద్వారా గోషా ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులకు రూ.10 భోజనం అందించడంపై అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓం ఫ్రీ యోగా వ్యవస్థాపకుడు రమేష్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న రమేష్

ఎంవీపీ కాలనీ: ఓం ఫ్రీ యోగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. యోగాలో చేస్తున్న విస్తృత సేవలకు గాను న్యూఢిల్లీకి చెందిన సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆ యూనివర్సిటీ వార్షికోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓం ఫ్రీ యోగా సెంటర్‌కు 'యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్' లభించిందన్నారు. గత 11 ఏళ్లుగా విశాఖ వాసులకు యోగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. యూట్యూబ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న రమేష్‌కు పలువురు నగర ప్రముఖులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.

లలితా త్రిపుర సుందరి దేవికి విశేష పూజలు

మధురవాడ: ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో లలితా త్రిపుర సుందరి దేవికి, మహా కామేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేక ప్రియునికి పంచామృత సుగంధ, నారికేళ, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. మారేడు పత్రాలు, వివిధ రకాల పువ్వులతో పూజలు చేశారు. శ్రీ చక్రం సమేత అమ్మవారికి కుంకుమ పూజలు చేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్, కమిటీ సభ్యులు ప్రతాపరాజు, సీహెచ్‌వై నాయుడు, జేడీ నాయుడు, కేవీ రావు, సోమేశ్వరరావు, సింహాచలం, విజయ్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవాల్లో ఆఖరి రోజు మంగళవారం ఆలయ ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

- మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద గల సిద్ధేశ్వర స్వామి పీఠంలోని అన్నపూర్ణ దేవీ సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలోపాల్గొన్నారు.

కేజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుల ఆందోళన

మహారాణిపేట : కేజీహెచ్‌లో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లను వివిధ ఆస్పత్రులకు బదిలీ చేయడంతో సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు సోమవారం నిరశన వ్యక్తం చేశారు. వివిధ ఆరోపణలపై ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు శ్రీకాంత్, రామకృష్ణ, శ్రీనివాస్‌ను నగరంలోని వివిధ ఆస్పత్రులకు బదిలీ చేశారు. ఇందుకు నిరశనగా సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.